



ఆరు గ్యారెంటీల అమలుకు కార్యాచరణ
- మంత్రి శ్రీధర్‌బాబు
8లో..

రామగుండం ఏరియాలో పర్యటించిన సింగరేణి సీఎండీ
8లో..



నామినేటెడ్ పదవులపై ఆశలు

- నెలాఖరులోగా భర్తీ చేస్తామని సీఎం ప్రకటన
- మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ నాయకుల ప్రదక్షిణలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ పార్టీ ఆశలు పెంచుకున్నారు. ఈ నెలాఖరు వరకు నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడి ప్రకటించడంతో జిల్లాకు చెందిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశీస్సుల కోసం, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయన దృష్టిలో పడేందుకు పలువురు నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి ప్రసన్నం చేసుకుంటున్నారు. నెల రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. పెద్దపల్లి నుంచి చింతకుంట విజయరమణారావు, మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం నుంచి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ గెలుపొందారు. శ్రీధర్‌బాబు సీనియర్ కావడంతో ఆయనకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి పదవి దక్కింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన వారికి మంత్రి పదవులు దక్కగా, జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వ విప్ పదవులు దక్కాయి. గత ప్రభుత్వ హయాంలో పెద్దపల్లి జిల్లా నుంచి ఎవరికి కూడా నామినేటెడ్, ప్రభుత్వ విప్ పదవులు దక్కకపోగా, నామినేటెడ్ పోస్టులు వరించాయి. ఐడీసీ చైర్మన్‌గా ఈద శంకర్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణ, బుద్ధ వనం ట్రస్టు చైర్మన్‌గా మల్లెపల్లి లక్ష్మయ్య, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా గంటా చక్రపాణి, ఆర్టీసీ చైర్మన్‌గా సోమారపు సత్యనారాయణ, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా కోలేటి దామోదర్, ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా పిట్టల రవీందర్, టీఎస్‌టీఎస్ చైర్మన్‌గా డాక్టర్ చిరుమల్ల రాకేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రఘువీర్‌సింగ్ తదితరులకు నామినేటెడ్ పోస్టులు దక్కిన విషయం తెలిసిందే. వివిధ కార్పొరేషన్ల చైర్మన్ పోస్టులన్నింటికీ ప్రభుత్వం రద్దు చేసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంకా రద్దు కాలేదు. మార్కెట్ కమిటీల పాలక వర్గాలను కూడా రద్దు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశించి టిక్కెట్ రాగా, పార్టీ టిక్కెట్ పొందిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన వారికి, పార్టీ కోసం అహర్నిషలు కష్ట పడుతున్న ద్వితీయశ్రేణి నాయకులకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టడం ఆనవాయితీగా వస్తున్నది. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం ఇప్పటికే పలువురు నాయకులు ప్రయత్నాలు చేసుకుంటుండగా, పార్టీ కొందరు సీనియర్ నాయకుల పేర్లను పరిశీలిస్తున్నది. మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గం నుంచి శశిభూషణ్ కాచె, గంట వెంకటరమణారెడ్డి, ఇనుముల సతీష్, ఒడ్నాల శ్రీనివాస్, తొట్ల తిరుపతియాదవ్, ఉప్పట్ల శ్రీనివాస్, చొప్పరి సదానందం, పెద్దపల్లి నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, గోపగాని సారయ్య, సయ్యద్ మస్రత్, అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, గీట్ల రాజేందర్‌రెడ్డి, గుండేటి అయిలయ్య యాదవ్, భూషణవేని రమేష్‌గౌడ్, ఎలువాక రాజయ్య, రేగుంట అశోక్, దన్నాయక్ దామోదర్‌రావు, సాంబి రెడ్డి, తదితరులు నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు. రామగుండం నియోజకవర్గం నుంచి ఏఐసీసీ సభ్యుడు హర్కార వేణుగోపాల్ రావు, ఐఎన్‌టీయూసీ నాయకులు గుమ్మడి కుమారస్వామి, బాబర్ సలీం పాషా, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, నూర సమ్మయ్య తదితర నాయకులు పదవులను ఆశిస్తున్నారు. ఇందులో ఇద్దరు, ముగ్గురు నాయకులకు మాత్రమే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పోస్టులు వరించనున్నాయి. మరికొందరికి జిల్లా స్థాయిలో ఉండే జిల్లా గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీ, ఎండోమెంట్ కమిటీ చైర్మన్ పదవులు వరించనున్నాయి. వీరేగాకుండా మరికొందరు నాయకులు కూడా నామినేటెడ్ పోస్టుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

పెద్దపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసేటప్పుడు చిన్నారులు జాగ్రత్త వహించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ తీగలు, సెల్ ఫోన్ టవర్‌లు ఉన్న చోట గాలిపటాలు ఎగురవేయకూడదని, విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పతంగులు పడితే తీసుకునే ప్రయత్నం చేయకూడదని పేర్కొన్నారు. రోడ్ల వెంట గాలిపటాల కోసం పరుగులు పెట్టవద్దని, ప్రమాదాన్ని ప్రాణం మీదకి తెచ్చుకోకూడదని, ఇంటి డాబాలపై విద్యుత్‌లైన్లు ఉన్న దగ్గర పతంగులు ఎట్టి పరిస్థితిలో ఎగురవేయకూడదని అన్నారు. తల్లిదండ్రులు, పెద్దవాళ్లు తప్పకుండా పిల్లలు డాబాల మీదికి వెళ్లకుండా చూడాలని, ఆరుబయట ఖాళీ ప్రదేశాలు, మైదానాల్లో మాత్రమే పతంగులను ఎగురవేయాలని సూచించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, పతంగుల కోసం ఒక మిద్దెపై నుంచి మరొక మిద్దెపైకి దూకి ప్రమాదాన్ని తెచ్చుకోకూడదని, పతంగుల పట్ల జాగ్రత్త వహించాలని, లేనిపోని ఇబ్బందులు తెచ్చుకోవద్దని సూచించారు. ఎటువంటి ప్రమాదాలు జరిగినా వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియచేయాలని కోరారు. వినియోగదారులందరు ఎప్పటికప్పుడు విద్యుత్‌పై అప్రమతంగా ఉండాలని, పండుగను ఆనందంగా జరుపుకోవాలని వరుణ్‌రెడ్డి కోరారు.

వ్యవసాయ పంప్ సెట్‌ల జియో ట్యాగింగ్‌ను నమ్మవద్దు..

వ్యవసాయ పంపుసెట్‌లకు జియో ట్యాగింగ్‌కు సంబంధించిన వాట్సాప్‌లో, కొన్ని పత్రికల్లో వచ్చిన సందేశాలు, వార్తలను నమ్మవద్దని, అదంతా తప్పుడు ప్రచారమని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఖండించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ పంపు సెట్లకు జియోటాగింగ్ ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. ఆ వార్తలను నమ్మవద్దని కోరారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జనవరి 13: నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో జరిగిన మైనార్టీ కృతజ్ఞత సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దఎత్తున తన గెలుపులో ముస్లింల పాత్ర మరువలేనిదని అన్నారు. ఎల్లపుడు అటువంటి ఆదరణ కోరుకుంటున్నట్లు మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. ఫోర్ ఇంక్లయిన్, ఎన్‌టీపీసీ ఖబరస్తాన్‌లకు ప్రహరీ నిర్మాణం పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. రామగుండం ఖబరస్తాన్, ఈద్గాలకు సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేయనున్నట్లు మక్కాన్‌సింగ్ తెలిపారు. నిరుపేద ముస్లిం కుటుంబాల కోసం ఫంక్షన్‌హాల్ త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ముస్లింలకు చేరేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాజా నజీమొద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే.

కళ్యాణ్‌నగర్, జనవరి 13: కార్పొరేషన్ 26వ డివిజన్‌లో సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు స్పందించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ శనివారం డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీ వాసులు రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేసిన మీదట శనివారం స్వయంగా పరిశీలించారు. త్వరితగతిన రోడ్డు పనులు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ మహంకాళిస్వామి, డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, మాజీ కార్పొరేటర్ బొమ్మక శైలజ, నాయకులు చుక్కల శ్రీనివాస్, తిపాపరపు శ్రీనివాస్, యుగంధర్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్మారం, జనవరి 13 : కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి కోరారు. మండలంలోని నాయకంపల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్యాలెండర్‌ను ఆవిస్కరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి

- మార్చిలోగా పీఆర్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ పనులు చేయాలి పూర్తి - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, జనవరి 13: పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి కోసం వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, సీపీ రెమా రాజేశ్వరి, ఇతర అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వ శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో జిల్లాలో చేయబోయే అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు అందరూ సహకరించి, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు సంబంధించిన ప్రతి సమస్య పరిష్కారం అయ్యే దిశగా పనిచేయాలని, గతంలో మంత్రిగా ఉన్నప్పుడు రాజీలేకుండా సమర్థవంతంగా పని చేశానని, ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఆ విధానం మారాలని, త్వరలో సిటిజన్ చార్ట్ తీసుకొస్తున్నామన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా జిల్లాలో ఆర్టీసీ బస్‌ల్లో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా నడుస్తున్నదని, ఆక్యుపెన్సీ రేట్ దాదాపు 80-90శాతంకు పైగా చేరుకున్నదన్నారు. మహిళలు సంతోషంగా ప్రయాణం చేస్తున్నారని, ఇప్పటివరకు మంథని డిపో పరిధిలో 2.12లక్షల మంది మహిళలు, గోదావరిఖని డిపో పరిధిలో 5.67 లక్షలు మహిళలు జీరో టికెట్లుతో ప్రయాణం సాగించారని, మంథని పరిధిలో 88 శాతం, గోదావరిఖని డిపో పరిధిలో 90శాతం ఆక్యుపెన్సీ రేటు చేరిందన్నారు. శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ఎంతమంది ప్రయాణం చేస్తారు, ఎన్ని బస్సులు అదనంగా కావాల్సి ఉంటుంది అనే విషయం తెలియజేయాలని, మహాలక్ష్మి పథకం అమలుతీరును అధికారులు తనిఖీ చేసి పరిశీలించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని లోటుపాట్లను సవరించే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10లక్షల సదుపాయాన్ని అమలుచేసినప్పటి నుంచి జిల్లాలో ఇప్పటివరకు 1081మంది సద్వినియోగం చేసుకున్నారన్నారు. మంథని, పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు సంబంధించి యంత్రాంగం పనితీరు మారి సమర్థవంతంగా అభివృద్ధి చేసేలా కట్టుదిట్టమైన ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీని ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీలు మోడల్ మున్సిపాలిటీలుగా, కార్పొరేషన్ మోడల్ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారేలా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

చర్యలు చేపట్టాలని సూచించారు. రొటీన్‌గా పని చేయకుండా సమర్థవంతమైన విధులను నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక పనులను, పెండింగ్‌లో ఉన్న పనులను ఏ విధంగా పూర్తిచేయాలనే ఆలోచన ఉండాలని, మార్చి లోపల ఎన్ని కంప్లీట్ చేసుకోవచ్చు అనేది నివేదిక తయారుచేయాలని, మార్చిలోపల పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, క్యారీ ఓవర్ ఫండ్స్ పనులను పూర్తిచేయాలన్నారు. మన ఊరు-మన బడిలో ఇప్పటివరకు ఎన్ని పనులు పూర్తి చేశాం, ఇంకా ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి, ఏయే పనులు చేయాల్సి ఉన్నది నివేదిక తయారుచేయాలన్నారు. విద్యాపరంగా జిల్లాను ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. శాఖాపరంగా చేపట్టే కార్యక్రమాల్లో కొన్ని శాఖల్లో ఇంప్రూవ్మెంట్ ఉండాలని, పనితీరులో మార్పు రావాలని సూచించారు. జిల్లాలోని ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందేలా మార్పు తీసుకురావాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి కలెక్టర్‌తో సమీక్షిస్తారని, శాఖల వారీగా ఇంప్రూవ్‌మెంట్ కనబడాలని సూచించారు. ప్రజా సంక్షేమం, ప్రజా శ్రేయస్సు కోసం సమర్థవంతంగా పని చేయాలని, అన్ని విభాగాలలో మార్పు కనబడాలని, జిల్లాలో గతంలో అల్లకల్లోలం సృష్టించారని, ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఉండే విధంగా పోలీసులు సహకరించాలని సీపీ రెమా రాజేశ్వరికి సూచించారు. ఖరీఫ్ 2023-24 వరి ధాన్యం సేకరణకు జిల్లాలో 307 ధాన్యం కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు లక్షా88 వేల 918 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, దీని విలువ 415.77కోట్లు కాగా, 88శాతం డబ్బులు 365.53 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించినట్లు మార్కెటింగ్ అధికారి మంత్రికి తెలిపారు. ఈసారి ధాన్యం సేకరణలో తరుగు, తేమ పేరిట ఒక్క రైతు నుంచి కూడా గింజ తగ్గింపు తీయలేదని, తీసుకున్న ధాన్యానికి పూర్తి చెల్లింపులు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మార్పు సాధ్యమైందని ప్రతి రైతు సంతోషంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా జిల్లాలో ఆయిల్‌పామ్ పంటల సాగును ప్రోత్సహించాలని, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని, పశు సంవర్ధక శాఖ, డీఆర్‌డీవో శాఖ పనితీరును పరిశీలిస్తూ ఈజీఎస్, ఆసరా పెన్షన్లు, సెర్ప్ యాక్టివిటీస్ పెరగాలని చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు, స్వయంఉపాధికి ప్రోత్సహించాలని, వైకుంఠధామాల్లో, సెగ్రిగేషన్ షెడ్లుల్లో పూర్తిసౌకర్యాలు కల్పించాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. మెప్మా ద్వారా అర్బన్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన విధంగా యాక్షన్‌ప్లాన్ తయారుచేసి సమర్పించాలని అదనపు కలెక్టర్‌కు సూచించారు. టూరిజం అనుకూలమైన ప్రదేశాలను గుర్తించి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి లక్ష్యాలు, సాధించిన ప్రగతి వివరాలను వివరించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని పూర్తిగా విజయవంతం చేశామని, 2,40,225 దరఖాస్తులు వచ్చాయని, 99.68 శాతం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నామని, శుక్రవారం మొత్తం ప్రక్రియ పూర్తిచేసుకుంటామని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లాలో విజయవంతంగా నడుస్తున్నదని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్‌డీవో శ్రీధర్, డీఈవో డి.మాధవి, డీఏవో ఆదిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.ప్రమోద్ కుమార్, ప్రభుత్వఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రమాకాంత్, డీపీవో చంద్రమౌళి, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం సివిల్ సప్లై శ్రీకాంత్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయానంద్

కళ్యాణ్‌నగర్, జనవరి 13: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు సముచితస్థానం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రామగుండం నాయకులు మల్లోజుల విజయానంద్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జైలుకు వెళ్ళిన వారు ఎఫ్ఐఆర్ కాపీ తీసుకువస్తే వారిని ఉద్యమకారులుగా గుర్తిస్తామని అనడం సరికాదని, తెలంగాణ ఉద్యమ సమయంలో వ్యాపారులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు, సబ్బండ వర్గాలు శాంతియుతంగా ఉద్యమాన్ని నడిపి తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు పథకంలో సబ్‌క్లాజ్‌లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని ఎఫ్ఆర్ఐ నంబర్, జైలుకు వెళ్లిన వివరాలు అడుగుతున్నారని, అలాకాకుండా ఉద్యమం చేసిన వారందరిని అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్య మకారులను గుర్తించి ప్రభుత్వం వారికి వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు బల్మూరి అమరేందర్‌రావు, జేవీ రాజు, తూముల అశోక్‌రావు, ఏలేశ్వరం వెంకటేష్, కానుగంటి శ్రీనివాస్, పొన్నం విజయకుమార్, రాజేష్‌శర్మ, అదర్‌సండే సమ్మారావు, ఫసియొద్దిన్, అందె సదానందం, సత్తార్ ఖాన్, ఇ.నరేష్, మహేష్, రాజేందర్, శశిరేఖ పాల్గొన్నారు.

పౌర హక్కుల సంఘం కరపత్రం ఆవిష్కరణ

పెద్దపల్లి కల్చరల్, జనవరి 13 : హైదరాబాదులో మార్చి 9,10న జరిగే పౌర హక్కుల సంఘం సభలకు సంబంధించిన కరపత్రాన్ని పెద్దపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద పౌరహక్కుల సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సభకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాదన కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్, నరవినోద్, బందారి రాజలింగయ్య, రెడ్డీ రాజుల సంపత్, బొంకురి లక్ష్మణ్ యాదవనేని పర్వతాలు, బాలసాని రాజయ్య గుమ్మడి కొమురయ్య, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

కాలువ చివరి భూములకు సాగు నీరు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జనవరి 13: రైతుల కోరిక మేరకు కాలువల్లో పూడుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి కాలువ చివరి భూములకు సైతం నీరందించే ఏర్పాట్లు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణ శివారులోని ఎస్సారెస్పీ కాలువను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో ఎస్సారెస్పీ కాలువల పరిస్థితిపై సమీక్షించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తనతో మాట్లాడుతూ కాలువల్లో సిల్ట్ పేరుకుపోయి సక్రమంగా నీరందక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారని, గత పది సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను పూడికల తొలగింపు పనులను శనివారం ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఇలా కాలువల్లో పూడికలు తీయించి, దెబ్బతిన్న ఉపకాలువల మరమ్మత్తులు చేయించి నియోజకవర్గంలోని రైతుల కాలువ చివరి భూములకు సైతం నీరందిస్తామని వివరించారు. ఈ సీజన్‌లోని పంటలకు సరిపడా సాగు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

నీటిని కాలువల ద్వారా అందించాలని కూడా ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ డీఈ మధుమతి, నాయకులు గోపగాని సారయ్య, అంతటి అన్నయ్యగౌడ్, అబ్బయ్యగౌడ్, సతీష్ పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు విజయం



విజేత పెద్దపల్లి జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, జనవరి 13 : ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ స్కూల్ మైదానంలో శనివారం జరిగిన టెన్నిస్ బాల్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంటులో జిల్లా జట్టు సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. తెలంగాణ రూరల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో అన్ని జిల్లాల నుంచి సీనియర్, జూనియర్ జట్లు పాల్గొన్నాయి. సీనియర్స్‌లో కరీంనగర్ రన్నరప్‌గా నిలిచింది. జూనియర్ విభాగంలో రంగారెడ్డి ప్రథమ, సిద్దిపేట రెండవ స్థానంలో నిలిచింది. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. రామగుండంలో క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బావిలో పడి ఒకరి మృతి

బోయినపల్లి, జనవరి 13: మండల కేంద్రంలో శనివారం పుల్లూరి అంజనేయులు (45) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన అంజనేయులు సిరిసిల్లలో మరమగ్గాల కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 11 గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన అంజనేయులు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. అంజనేయులు భార్య లలిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు.

బావిలోకి దూసుకెళ్లిన కారు : ఒకరు మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 13: పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు కారు బావిలో పడి ఒకరు మృతిచెందగా, ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిమ్మనపల్లి గ్రామం నుంచి పెద్దకల్వలకు వెళ్తున్న కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిందన్నారు. ఈ ప్రమాదంలో రంగంపల్లికి చెందిన వినిత్‌రెడ్డి(27) మృతి చెందగా, కారులో ఉన్న గాదె అఖిల్, అల్లం బాల అనురోహిత్‌రెడ్డి, సాయిలు బావి పైప్ ద్వారా బయటికి వచ్చి క్షేమంగా బయటపడినట్లు తెలిపారు. పెద్దపల్లి ఎస్ఐ 2 మల్లేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుజరాత్‌వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండల శివారులోని ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుజరాత్‌కు చెందిన కులదీప్ కుమార్(28) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన కులదీప్‌కుమార్ ఓ బీడీ కంపెనీలో పనులు చేస్తుండేవాడన్నారు. ఈ నెల 10న గంభీరావుపేటకు చెందిన కిషోర్‌తో కులదీప్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తుండగా గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టిందన్నారు. దీంతో కులదీప్‌కుమార్, కిషోర్ తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. కులదీప్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో మొదట సిరిసిల్లకు తరలించారని, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారన్నారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ కులదీప్‌కుమార్ శనివారం మృతి చెందాడన్నారు.

వెంకటయ్యపల్లిలో..

గంగాధర: గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన రావుల లచ్చగౌడ్(58) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. లచ్చగౌడ్ గతేడాది డిసెంబరు 26న ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్లి గ్రామానికి తిరిగి వస్తుండగా కురి క్యాల శివారులో నిలిపివేసిన లారీని వెనక నుంచి ఢీకొట్టాడన్నారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు.

మద్యం మానుకోవాలన్నందుకు ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో మద్యం మానుకోవాలని మందలించినందుకు రంగు దేవయ్య(49) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణాకు చెందిన దేవయ్య నాలుగేళ్ల కిందట భార్య పిల్లలతో కలిసి ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు వలస వచ్చాడు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని జీవిస్తున్నాడు. స్థానికంగా మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడు. పంట దిగుబడి తగ్గడంతోపాటు కుటుంబ పోషణకు సుమారు రూ.2 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. తరుచూ ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటుండేవి. మూడు రోజుల కిందట గొడవ జరగగా, ఇంటి ఎదురుగా ఉన్న నారాయణ మందలించడంతో ఆయనపై దాడికి దిగాడు. రోజూ తాగొచ్చి గొడవపడుతున్నావంటూ తాగుడు మానుకోవాలంటూ భార్య బాలవ్వ దేవయ్య మధ్య శుక్రవారం రాత్రి వాగ్వాదం చోటుచేకుంది. శనివారం ఉదయం లేచి చూసే సరికి దేవయ్య ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దకల్వలలో..

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వలకు చెందిన నర్ల పోచాలు (58) మద్యానికి బానిసై మానసిక వేదనతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ2 మల్లేష్ తెలిపారు.

భవనం పైనుంచి పడి మధ్యప్రదేశ్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి13: భవన నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో పైనుంచి పడి మధ్యప్రదేశ్ రాష్ట్రం బాల్‌గాటు జిల్లాకు చెందిన లకనో కోహెర్ (34)మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన లకనో కోహెర్ కుటుంబం ఏడాది కిందట కరీంనగర్‌కు వచ్చి కొత్తపల్లిలోని ఒక భవన నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నారన్నారు. శనివారం భవనంలోని నాలుగో అంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయని, ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

» అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

» ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త

» అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారు జామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

» ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు

» అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో

» 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

» అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం

» రైలు పట్టాలపై పడిన గాలి పటం

» నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.


ఆలయ ఆవరణలో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 13: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

సిర్పూర్ ఎమ్మెల్యే పూజలు


అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే హరీష్‌బాబు

సిర్పూర్-కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు సత్కరించారు. అలాగే ఖమ్మం అడిషనల్ న్యాయమూర్తి గుర్రం శ్రీనివాస్ కూడా అంజన్నను దర్శించుకున్నారు

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి

జగిత్యాల అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీ

కొడిమ్యాల, జనవరి 13: క్రీడలు క్రీడాకారుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఆర్ ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని నమిళికొండ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వాలీబాల్ సీనియర్ క్రీడాకారుల స్మారకార్థం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నమిళికొండ పోలీస్ బృందం వారు నిర్వహిస్తున్న వాలీబాల్ ఆటల పోటీలను అడిషనల్ ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతీ వ్యక్తిలో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. నమిళికొండ గ్రామం నుంచి పలువురు పోలీస్ ఉద్యోగాలు చేస్తు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల స్మారకార్థం ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు(ఏఆర్), జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, సీఎస్ఎస్ సీఐ వేంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల ఎస్సై కె వెంకట్‌రావు, జడ్పీటీసీ ప్రశాంతి, ఎంఈవో శ్రీనివాస్, సర్పంచు అనితనరేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నాయకులు జి. లక్ష్మణ్, ఎం క్రిష్టారెడ్డి, సీహెచ్ సుధీర్‌రావు, రాంచందర్‌రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రఘుపతిరెడ్డి, ఫుడ్ స్పాన్సర్లు లక్ష్మీరాజం, ఇ.శ్రీనివాస్, స్పోర్ట్స్ కిట్ స్పాన్సర్ ఎన్. శ్రీనివాస్, షాబొద్దీన్, టోర్నమెంట్ నిర్వహిస్తున్న నమిళికొండ పోలీస్ బృందం పాల్గొన్నారు. ఈ క్రీడల్లో 42 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.


రాజన్న ఆలయ పరిసరాల్లో

భక్తిభావాన్ని పెంపొందించాలి..

● భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● త్వరలో సీఎంతో సమీక్షకు కసరత్తు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నరసింహుడి ధ్వజ స్తంభం వద్ద మొక్కుతున్న దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్

వేములవాడ టౌన్, జనవరి 13 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో భక్తిభావం పెంపొందేలా చూడాలని, ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులకు సూచించారు. వేములవాడ ఆలయంలోని చైర్మన్ చాంబర్‌లో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాజన్న ఆలయానికి వచ్చేది పేద, మధ్యతరగతి భక్తులేనని, వారికి కావాల్సిన వసతి సౌకర్యాలను మెరుగు పర్చాలని అన్నారు. దర్శనం సులువుగా అయ్యేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శనాలకు కొత్త నివేదిక తయారు చేయాలన్నారు. వసతి గదుల్లోనూ భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. సామాన్య భక్తులు విడిది చేసేందుకు మాస్టర్ ప్లాన్‌కు ఆటంకం కలుగకుండా షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కరీంనగర్‌లోని కల్యాణ మండపం ప్రస్తుతం ప్రాధన్యం లేనందున దాని స్థానంలో ఆదాయాన్ని పెంపొందించే విధంగా కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. రాజన్న ఆలయానికి సంబంధించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి ఆదాయాన్ని పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా సమ్మక్క, సారలమ్మ జాతరతోపాటు మహాశివరాత్రి జాతరకు భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, ప్రతాప నవీన్, హరికిషన్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, డీఈ రఘునందన్ ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో దేవాదాయశాఖ కమిషనర్ పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ వి అనిల్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. వేద పండితులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి దర్శనం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. అనుబంధ ఆలయాలు, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. ఆయన వెంట ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇనుగంటి రమా వేంకటేశ్వర్‌రావు, అక్కెనపెల్లి సురేందర్, అర్చకులు నంబి నరసింహమూర్తి, అశ్విన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో ..

మల్యాల: రాష్ట్ర దేవాదాయ కమిషనర్ వి అనిల్‌కుమార్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకు న్నారు. కుటుంబ సమేతంగా ఆలయంకు వచ్చిన కమిష నర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో వెంకటేష్ సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్ ఆలయ అధికా రులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి సమావేశాలు నిర్వహించకపోవడం, అధికారుల బదిలీపై డైరెక్టర్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

నరసింహుని ఆలయంలో పెరిగిన రద్దీ

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కూడా తోడు కావటంతో అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో, రావి చెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ భక్తులు ప్రదక్షిణాలు చేశారు. స్వామి వారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు.

అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యా, నరసింహ మూర్తి, అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, సంతోష్, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక దందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు


మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో, గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో ఇసుక డంపులను పరిశీలిస్తున్న పోలీసులు

గన్నేరువరం, జనవరి 13, అక్రమంగా ఇసుక దందాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి హెచ్చరించారు. శనివారం మండలంలోని గుండ్లపల్లి శివారులో ఇసుక డంపులపై ఎస్ఐ చందా నరసింహారావుతో కలిసి దాడులు నిర్వహించారు. సుమారు 17 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుండ్లపల్లి శివారులో పలుచోట్ల అక్రమంగా ఇసుక డంపులను పోసి రాత్రి వేళలో సిద్దిపేట, హైదరాబాద్‌కు తరలిస్తున్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు.

మెట్‌పల్లి రూరల్: అక్రమంగా ఇసుకను నిల్వ చేసినా, తరలించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను నిల్వ చేసినట్లు సమచారం అందగా ఆర్ఐ ఉమేశ్‌తో కలిసి దాడులు నిర్వహించి డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన డంపుల్లో ఇసుక సుమారు 10 ట్రాక్టర్ల కంటే ఎక్కువ ఉండవొచ్చని అంచనా వేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మొరం తరలించినా, నిల్వచేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాలువకు నీటి విడుదల


ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద కాలువకు మూడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఎస్సారెస్పీ అధికారులు ప్రకటించారు. చేపలు పట్టేవారు, పశువుల కాపర్లు, రైతులు, సాధారణ ప్రజలు వరద కాలువ వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇదిలాఉండగా ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 63.185 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 72.908 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి 8,149 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కు లు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూ సెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



సీఎండీని కలిసిన జీఎంలు



సీఅండ్ఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎంలు

రామగిరి, జనవరి 13: సింగరేణి నూతన సీఎండిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బలరాం(ఐఆర్ఎస్)ను శనివారం ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు క్యాంప్ కార్యాలయంలో మర్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా డివిజన్‌లో భూసేకరణకు సంబంధించిన విషయాలను సీఎండీ దృష్టికి తీసికెళ్లారు. గనుల ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. దానికిపై స్పందించిన సీఎండీ భూసేకరణ విషయాలపై సంబంధిత అధికారులతో మాట్లాడుతానని, నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో చేపట్టాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, వెంకటరమణ, ఐలయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏఎల్‌పీలో పదోన్నతి ఉత్తర్వులు అందజేత

రామగిరి, జనవరి 13: సింగరేణి ఏపీఏ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న 17 మంది ఉద్యోగులకు శనివారం పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్‌వోపీఎంలు జనార్ధన్, తిరుపతిల చేతుల మీదుగా పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌పి అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 కార్మికుల సమస్యలను పరిష్కరించండి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 13: ఆర్జీ-2 ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచి కమిటీ సీఎండీ బలరాంను కోరారు. ఏరియా పర్యటనకు వచ్చిన ఆయనను కలిసిన నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. డిస్పెన్సరీలో సరైన వైద్య సదుపాయాలు కల్పించి, మందుల కొరత లేకుండా చూడాలని, కార్మిక వాడలలో రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేయాలని, బ్లాసింగ్‌తో దెబ్బతిన్న క్వార్టర్‌లకు మరమ్మతులు చేయాలని వినతిపత్రంలో కోరారు. కాలనీలో సుమారు 40 ఏళ్ల కిందట వేసిన డ్రైనేజీ లైన్లు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌పీలో దుమ్ము నియంత్రణ చర్యలు మెరుగుపరచాలని, ఓసీపీ-3లో 100టన్నుల డంపర్ యార్డుకు పక్కగా 60 టన్నుల డంపర్‌లకు పార్కింగ్ కేటాయించాలని, సీఎంపీఎఫ్ లోన్ ఆలస్యమవుతున్నందున కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా లోన్లు మంజూరు అయ్యేలా సీఎంపీఎఫ్ అధికారులతో చర్చించాలని కోరారు. సీఎండీని కలిసిన వారిలో ప్రకాష్, రాజారత్నం, రవీందర్, అన్నారావు, సాంబశివరావు, మహేందర్, రవికుమార్ ఉన్నారు.

కాగా, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ బొక్కల శ్రీనివాస్ కలిశారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి ఆర్జీ రీజియన్‌కు వచ్చిన సీఎండీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డెత్ సర్టిఫికేట్ కోసం మూడేళ్లుగా తిప్పుకుంటున్నారు..

- రామగుండం ఎమ్మెల్యేకు బాధితుల ఫిర్యాదు

కోల్‌సిటీ, జనవరి 13: రామగుండంకు చెందిన గోపిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి 2020 ఏప్రిల్‌లో మరణించారని, అతని కుటుంబానికి డెత్ సర్టిఫికేట్ ఇవ్వకుండా మున్సిపల్ రెవెన్యూ అధికారులు తిప్పించుకుంటున్నారని మృతుని బంధువులు శనివారం వాట్సప్ ద్వారా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఫిర్యాదు చేశారు. రామగుండంకు చెందిన గోపిశెట్టి శ్రీనివాస్-నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్ద కూతురు మానసిక వికలాంగురాలు కాగా చిన్న కూతురుకు వివాహమైంది. శ్రీనివాస్ 2020 ఏప్రిల్‌లో మరణించారు. కొవిడ్ సమయం కావడంతో ఆఫీస్‌లు పనిచేయకపోవడం మృతుడి కుటుంబ సభ్యులు కూడా దరఖాస్తు చేసే పరిస్థితి లేకపోవడంతో వారి చిన్న కూతురు కుటుంబసభ్యులే మంచిర్యాల జిల్లా లక్షట్‌పేట నుంచి వచ్చి 2021లో దరఖాస్తు చేశారు. దీన్ని విచారించిన రామగుండం నగర పాలక సంస్థ అధికారులు శ్రీనివాస్ మృతిచెంది ఏడాది దాటిందని ఆర్‌డీవో కార్యాలయం నుంచి ప్రొసీడింగ్స్ తీసుకురావాలని తిప్పిపంపారు. దీంతో వారు గత ఏడాది జూలైలో ఆర్‌డీవో ప్రొసీడింగ్స్‌కు దరఖాస్తు చేశారు. ఆగస్టు 8న రామగుండం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విచారణ చేశారు. తరువాత ఆ పత్రాలు ఎక్కడో పోయాయని జిరాక్స్‌లు తీసుకురావాలని తిప్పారు. ఐదారునెలలుగా మృతుని కుటుంబ సభ్యులు కార్యాలయాల చూట్టు తిరుగుతూ ఉన్నారు. శ్రీనివాస్ డెత్ సర్టిఫికెట్ ఉంటే గానీ నాగలక్ష్మికి వితంతు పెన్షన్ మంజూరు కాదని, ఆ కుటుంబానికి పెన్షన్ ఆధారం కాగా కనుక డెత్ సర్టిఫికెట్ ఇప్పించాలంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఏమైనా ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలంటూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొనడంతో స్పందించిన బాధితుల బంధువులు శనివారం ఆయనకు వాట్సప్‌లో ఫిర్యాదుచేశారు. దీనిపై స్పందించిన రాజ్‌ఠాకూర్ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన నిర్లక్ష్యం ఖరీదు బాధితురాలి గుండె ఘోష, సంఘర్షణ అంటూ పేర్కొన్నారు. భర్త చనిపోయి మూడేళ్ళయినా డెత్ సర్టిఫికేట్ రాకపోవడంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆసరా పెన్షన్ నష్టపోయారని, తనను నమ్మి రామగుండం ప్రజలు గెలిపించారని, ప్రభుత్వంనుంచి రావాల్సిన ఏ పథకానికి సంబంధించైనా ఇబ్బందులు ఉంటే తనకు ఫిర్యాదు చేయాలని, వారి భరతం పడతానని పేర్కొన్నారు. బాధితులకు వెంటనే న్యాయంజరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

దంపతులపై దాడి

కోల్‌సిటీ, జనవరి 13: అప్పుగా తీసుకున్న డబ్బులు వాపస్ ఇవ్వమన్నందుకు కొందరు వ్యక్తులు దంపతులపై దాడి చేసిన ఘటన శుక్రవారం గోదావరిఖనిలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం స్థానిక మార్కండేయకాలనీ ఓ ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు కోట శ్రీనివాస్ ప్రభాకర్ వద్ద కొంత మొత్తం అప్పుగా తీసుకున్నారు. అతడు అతని భార్య శుక్రవారం అప్పు డబ్బులు అడిగేందుకు గోదావరిఖనికి వచ్చారు. ఒక ఇంట్లో మాట్లాడుకుందామని చెప్పి కోట కుమార్, నెలకంటి రాము, మరికొందరు దాడి చేసినట్టు బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

కోల్‌సిటీ, జనవరి 13: గోదావరిఖని మార్కండేయకాలనీ, వెంకటేశ్వర కాలనీలో రెండు రోజుల క్రితం జరిగిన చోరీ కేసుల్లో నిందితుడిని శనివారం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కూపీ లాగిన పోలీసులు మెట్‌పల్లికి చెందిన మాజీ నేరస్తుడి ప్రమేయం ఉన్నట్టు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి పండుగకు సెలవుల దృష్ట్యా తాళం వేసిన ఇళ్ళలో పాత నేరస్తులు చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో పాతనేరుస్తులు గోదావరిఖనిలో చోరీలకు పాల్పడటం గమనార్హం.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 13 : మండలంలోని గుర్రాంపల్లి గ్రామంలో శనివారం గడపగడపకు అయోధ్య రాములోరి అక్షింతలను డప్పు, వాయిద్యాల నడుమ ఊరేగింపు చేసి పంపిణీ చేశారు. ఈనెల 22న చారిత్రాత్మక అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా రాముల వారి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మదారెడ్డి భాగ్యలక్ష్మీ, సింగిల్ విండో చైర్మన్ మాదిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 13 : పెద్దపల్లి పట్టణంలోని 5,6,7 వార్డులలో మహిళలకు నందన గార్డెన్లో ఆచార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వ్యవసాయ అధికారి అలివేణి, డాక్టర్ ప్రణీత్ హాజరై పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆచార్య ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జవ్వాజి రాజేష్, కాంగ్రెస్ నాయకులు గుజ్జుల కుమార్, పిడుగు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం ఏరియాలో పర్యటించిన సీఎండీ



ఆర్జీ-1 ఏరియా 2 ఇంక్లయిన్‌లో కార్మికులతో మాట్లాడుతున్న సీఎండీ



ఓసీపీ-3 కృషిభవనలో ఉద్యోగులతో మాట్లాడుతున్న సీఎండీ

గోదావరిఖని, జనవరి 13: రామగుండం ఏరియా-1లో శనివారం సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పర్యటించారు. సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి ఏరియాకు వచ్చిన బలరాంకు జీఎం చింతల శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. పర్యటనలో భాగంగా 2 ఇంక్లయిన్ గనిలోకి వెళ్లి బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యలను పరిశీలించారు. ఉదయం షిఫ్టు కార్మికులతో కలిసి మాట్లాడిన సీఎండీ బలరాం వారితో కలిసి క్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. కార్మికులకు తాగునీరు అందించేందుకు వీలుగా ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ నిర్మాణం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఏరియా పరిధిలోని గనులు, ఓసీపీల ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను తెలుసుకుని లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. వెంట జీఎం పర్సనల్ హన్మంతరావు, ఆర్జీ-2,3 జీఎంలు సూర్యనారాయణ, సుధాకర్‌రావు, అడ్రియాల జీఎం వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, పలువురు అధికారులు ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 13: సింగరేణి సీఎండీ ఎన్ బలరాం శనివారం ఆర్జీ-2 ఏరియాలో పర్యటించారు. తెల్లవారు జామున 3 గంటలకు ఓసీపీ-3 ప్రాజెక్టును సందర్శించారు. సీహెచ్‌పీలో బొగ్గు రవాణా తీరును పరిశీలించిన సీఎండీ బొగ్గు రవాణాను పెంచాలని ఉద్యోగులకు సూచించారు. కృషి భవన్‌లో రాత్రిషిఫ్టు ఉద్యోగులతో మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి పెంచడం, యంత్రాల నిర్వహణలపై ఉద్యోగులను అడిగి సలహాలు తీసుకున్నారు. వ్యూపాయింట్ నుంచి ప్రాజెక్టు పనిస్థలాలను పరిశీలించారు. క్వారీలో షావల్, డంపర్‌లను పరిశీలించిన బలరాం వాటి పనితీరు వివరాలు తెలుసుకున్నారు. సీఎండీ వెంట జీఎం సూర్యనారాయణ, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, పీఓ మధుసూదన్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, మేనేజర్ రమేష్, అధికారులు నర్సింగరావు ఉన్నారు.



సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సీఎండీని కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 13: సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా రామగుండం పర్యటను వచ్చిన బలరాం నాయక్‌ను శనివారం స్థానిక ఇల్లెందు గెస్టహౌస్‌లో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కార్మికుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కార మార్గాలు చూపాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సీఎండీని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాంగ్రెస్ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు మహంకాళిస్వామి, బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, ముస్తాఫ, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్, జనవరి 13 : సింగరేణి పునరావాస మల్కాపూర్ గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీఎండీ బలరాంను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎండీ రహీం కోరారు. శనివారం రామగుండం ప్రాంతానికి వచ్చిన సీఎండీని కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. మల్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, గ్రామంలోని బ్రాహ్మణకుంట చెరువులో పూడిక తీసి, రెండువైపులా బతుకమ్మ ఘాట్ ఏర్పాటుచేయాలని, చెరువు పరిసరాల్లో సుందరీకరణ చేయాలని కోరారు.

ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

కోల్‌సిటీటౌన్, జనవరి 13 : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసించి ఎలాంటి ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నటువంటి యువతకు సింగరేణి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. ఈ మేరకు శనివారం గోదావరిఖనికి వచ్చిన సీఎండీ బలరామ్ నాయక్‌ను ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మార్కాపురి సూర్య కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసీపీ-లో స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చే విధంగా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని, సింగరేణి నిధులతో ఒక డిజిటల్ లైబ్రరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో కూడిన స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి స్టేడియంలో జాగింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, ఓసీపీ పైలు బ్లాస్టింగ్‌పై నియంత్రణ ఉండేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆసాల శివన్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి సంస్థ సీబీఎస్ఈ, మైనింగ్ డిప్లమా, ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేసి ఉన్నత విద్యను అందించాలని సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్‌ను ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం గోదావరిఖనికి వచ్చిన సీఎండీ బలరామ్‌నాయక్‌ను ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతమ్, జిల్లా సహాయకార్యదర్శి మొలుగూరి నితీలేష్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గతంలో సింగరేణి పాఠశాలలు ఉన్నాయని, కొన్ని అనివార్య కారణాలతో తగ్గిపోయాయని, క్రమక్రమంగా సింగరేణి సంస్థ విద్యావ్యవస్థను పట్టించుకోవడం లేదని ప్రీతమ్ పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకొని సింగరేణి సీబీఎస్ఈ, మైనింగ్ డిప్లమా, ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్కపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా లాన్‌టెన్నిస్ విజేతగా సింగరేణి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 13: కోల్ ఇండియా లాన్‌టెన్నిస్ పోటీల్లో సింగరేణి జట్లు విజేతలుగా నిలిచాయి. ఛత్తీస్‌గఢ్‌లోని ఎస్ఈసీఎల్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న కోల్ ఇండియా స్థాయి లాన్‌టెన్నిస్ పోటీలు శనివారంతో ముగిశాయి. వెటరన్ విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండిటిలోనూ సింగరేణి క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. సింగిల్స్ విభాగం ఫైనల్ పోటీలో భూపాలపల్లికి చెందిన వై తిరుమల ఆర్జీ-2 ఓసీపీ ఆపరేటర్ వెంకటేశ్వర్లుపై గెలుపొందాడు. డబుల్స్ ఫైనల్‌లో ఎంసీఎల్‌కు చెందిన పీకే మిశ్రా, సత్‌పతేలపై సింగరేణి జట్టు (చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ-1), (వై తిరుమల, భూపాలపల్లి) 6,4 తేడాతో గెలిచి ప్రథమ బహుమతి సాధించారు. టీం ఛాంపియన్ షిప్‌లో, సింగిల్స్‌లో సెమీఫైనల్ వరకు చేరుకుని మురుగైన ఆటతీరును ప్రదర్శించారు.



సింగరేణి లాన్‌టెన్నిస్ క్రీడాకారులు

ఆరు గ్యారెంటీల అమలుకు కార్యాచరణ : మంత్రి శ్రీధర్‌బాబు



కల్వచర్లలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు



నాగారం జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్‌బాబు

రామగిరి, జనవరి 13: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు పల్లెదవాఖానను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని, క్రమశిక్షణతో గ్యారెంటీ పథకాలను అమలుచేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 9 రోజుల్లోనే రెండు పథకాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షలతో వైద్యం అందించే పథకాన్ని ఏర్పాటుచేశామన్నారు. ఆరుగ్యారెంటీలపై ఎలాంటి అపోహలకు గురికావద్దని ప్రలకు సూచించారు. గ్రామానికి సంబంధించిన సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేసిన రోడ్డుకు మరమ్మతులు నోచుకోలేదని, తమ ప్రభుత్వంలో కల్వచర్ల- లొంకకేసారం వరకు ప్రధాన రహదారి నిర్మాణం చేస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తుదారుల వద్ద పథకాలు ఇప్పిస్తామని ఎవరైనా ఒక్క రూపాయి వసూళ్లలకు పాల్పడినా వెంటనే కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులను నిష్పక్షపాతంగా ఎంపిక చేసి లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. పల్లెదవాఖానలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని సూచించారు. సర్పంచ్ గంట పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఆరెల్లిదేవక్క, తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో కాటం భాస్కర్, ఉపసర్పంచ్ వెము కనకయ్య, ఎంపీటీసీ కొట్టే సందీప్, తొట్ల తిరుపతియాదవ్, గంట వెంకటరమణరెడ్డి, వనం రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ గంట పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ ఆరెల్లి దేవక్క, తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో కాటం భాస్కర్, ఉపసర్పంచ్ వెము కనకయ్య, ఎంపీటీసీ కొట్టే సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీదేవర ఆలయంలో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు

మంథని/మంథనిరూరల్, జనవరి 13: సంక్రాంతి పండగను పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని బోయినిపేటలో శ్రీలక్ష్మీదేవర అమ్మవారిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ముందస్తుగా దర్శించుకున్నారు. శనివారం అమ్మవారికి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ నేత గుండా రాజు ఆధ్వర్యంలో బోయినిపేట వాసులు, ఆలయ కమిటీ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో డివిజన్‌లోని మంథని, కమాన్‌పూర్, రామగిరి, పాలకుర్తి మండలాలల్లోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మంత్రి శ్రీధర్‌బాబు పంపిణీ చేశారు. మండలంలోని నాగారంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు.

వేర్వేరుగా జరిగి ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, నాగారం సర్పంచ్ బూడిద మల్లేష్, కాంగ్రెస్ నేతలు శశిభూషణ్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, ఉప్పట్ల శ్రీను, ఐత ప్రకాష్‌రెడ్డి, తొట్ల తిరుపతియాద్, పోలు శివ, ఐలి ప్రసాద్, పేరవేన లింగయ్యయాదవ్, కదుదుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

కరీంనగర్ టౌన్, జనవరి 13: కరీంనగర్‌కు చెందిన శాతవాహన లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడు లయన్ కెప్టెన్ బుర్ర మధుసూన్ రెడ్డికి అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ అరుదైన మైల్ స్టోన్ చెవరాన్ అవార్డుతో గౌరవాన్ని అందించింది. ఈమేరకు బుర్ర మధుసూధన్‌రెడ్డికి అంతర్జాతీయ లయన్స్ సంస్థ అధ్యక్షురాలు లయన్ డాక్టర్ పట్టి హిల్ అవార్డుకు ఎంపిక చేసి పంపించిన మైల్ స్టోన్ చెవరాన్ అవార్డును శనివారం జిల్లా గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కెబినెట్ సెక్రటరీ లయన్ ఎంవి రమణారెడ్డి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు లయన్ వై.శేఖర్‌రావు, ఎం.మహేం దర్, కె.సత్యం, కె.రాజేందర్‌రెడ్డి, ఎన్.ప్రసాదరావు, నర్సింగరావు, ఇనుగుర్తి రమేశ్, జి.లక్ష్మయ్య, సంపత్‌కుమారి, జగదీశ్వరాచారి, తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న బుర్ర మధుసూధన్‌రెడ్డి

ముగ్గుల పోటీలు

కోల్‌సిటీటౌన్, జనవరి 13: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని ఆర్యవైశ్య భవన్‌లో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. పురుషులకు కైట్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. గెలుపొందిన వారికి వెండిని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెనిశెట్టి నటరాజ్‌శేఖర్, ఆనంద్, కిషోర్, మహిళా అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, భవాని, స్రవంతి, వాస్లవి క్లబ్ అధ్యక్షులు ఆనంద్‌బాబు, రాజేందర్, రాజేంద్రప్రసాద్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

● **ఎలిగేడు:** ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తుగా గ్రామపంచాయతీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 30మంది మహిళలు పోటీల్లో పాల్గొనగా మొదటి బహుమతి విజేత సౌజన్యకు వెయ్యి రూపాయలు, ద్వితీయ బహుమతి విజేత శ్రీవిద్యకు 750 రూపాయలు, శ్రీహని, మీనాక్షలకు చెరో 500 రూపాయలు అందజేశారు. మిగిలినవారికి కన్సోలేషన్ బహుమతులను సర్పంచ్ గొల్లె కావేరి అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సావిత్రమ్మ, అట్టేపల్లి కనకయ్య, పంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 13: తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) జపాన్, జర్మనీలలో నర్సింగ్ ఉద్యోగాల అవకాశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం 22-30 సంవత్సరాల వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం డిప్లొమా హోల్డర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి నెలకు లక్షా 50 వేల రూపాయల నుంచి లక్షా 80 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్, జర్మన్ భాషలపై శిక్షణ, అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలపై శిక్షణను హైదరాబాద్‌లో ఇస్తారన్నారు. వివరాలకు 8919047600, 9573945684, 6302292450 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

18న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, జనవరి 13: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు జనవరి 18న జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐ వద్ద ఉదయం 11గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల పదో తరగతి ఆపైన మార్కెటింగ్‌లో ఎంబీఏ, హెచ్ఆర్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ అగ్రికల్చర్, డిగ్రీ, డిప్లొమా విద్యార్హతలు కలిగిన యువతీ, యువకులు జాబ్ మేళాకు అన్ని సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో రావాలని తెలిపారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని కృషి విజ్ఞాన ఫర్టిలైజర్స్ కంపెనీలో పెద్దపల్లి జిల్లా పరిధిలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8985336947, 9502642441 నంబర్లలో సంప్రదించాలని ఆయన ప్రకటనలో సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, జనవరి 13: జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు వశిష్ఠ, సాత్విక్, కార్తికేయలను అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అభినందించారు. రాష్ట్ర టార్గెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ముగ్గురు ప్రతిభను చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14 నుంచి 16 వరకు సిద్దిపేటలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

ఓదెల, జనవరి 13: ఓదెల మండలంలోని కొలనూర్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ముందస్తుగా బోగి మంటలు పెట్టి వేడుకలు జరుపుకున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారుల కష్టాన్ని గుర్తించినందుకు అభినందనలు తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రె లక్ష్మారెడ్డి, మోహన్ రెడ్డి, రాజేశం, శంకర్, చంద్రయ్య, నర్సయ్య, సదా శివ, రాజిరెడ్డి, బాబురావు, భగవన్‌రెడ్డి, ఐలయ్యలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతలు పంపిణీ

ఎలిగేడు, జనవరి 13: ఎలిగేడు మండలం నారాయణపల్లిలో అయోధ్య రాములవారి అక్షింతలను శనివారం గడప గడపకూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాడ కొండాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ నబ్బు శ్రీధర్, మామిడాల రమేష్, వి.రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎల్‌వోసీ అందజేత

ఎలిగేడు, జనవరి 13: ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామానికి చెందిన భైరి పద్మకు రూ.2లక్షల ఎల్‌వోసీని హైదరాబాద్‌లోని నిమ్స్‌కు ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కొప్పర తిరుమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు లాలపల్లి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత

జూలపల్లి, జనవరి 13. మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు శనివారం కరీంనగర్‌కు చెందిన ప్రైమ్ కిడ్నీ సెంటర్ యాజమాన్యం వారు టీషర్టులను అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు చాందిని, క్రిష్ణ చైతన్య, క్రీడాకారులు కాజామియా, కేతన్, నరేష్, సాగర్ పలువురు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి

జూలపల్లి, జనవరి 13: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, ప్రధాన సమస్యలను పరిష్కరించాలని మండల కాంగ్రెస్ నాయకులు మానుమండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకలు శనివారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. మండల సమస్యల పరిష్కారంపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు మానుమండ్ల శ్రీనివాస్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎండీ ఫకీర్, కోరెపు సంపత్, సాయి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

రామగిరి, జనవరి 13: రామగిరి మండలం కల్వచర్ల భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో శనివారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు హమాలీ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కార్మిక సమైఖ్య సంఘం అధ్యక్షుడు చిలువేరు స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈకార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, లొంకకేసారం సర్పంచ్ ఎండీ మంజూర్, జిల్లా కమిటి నాయకులు తిరునహరిరాజు, ఎస్కే షరీఫ్, భైరి శంకర్, తొగరి చంద్రయ్య, సుధాకర్, లక్ష్మినారాయణ, సంతోష్, స్వామి, ఏసుదాసు, కుమార స్వామి, చంద్రమౌళి, సతీష్, మల్లేష్, పుల్లయ్య, సురేష్ పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి'

ధర్మారం, జనవరి13: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలని బీజేపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి కోరారు. మండలంలోని నాయకంపల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి శనివారం వికాస్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో లక్ష్మన్, శ్రీనివాస్, రాజు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారులపై తప్పుడు ఆరోపణలు

కమాన్‌పూర్, జనవరి 13 : అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు కూడా విద్యుత్ సరఫరా లేదంటూ తమపై శనివారం తప్పుడు ఆరోపణ లు చేసిన వారిపై చర్యలకు ఉపక్రమించారు. తప్పు డు ఆరోపణలకు పాల్పడిన వారిపై ఆదివారం ట్రాన్స్‌కో ఏఈ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.